ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
శుక్రవారం | 10 జులై , 2026 | పేజీలు : 5

## సరళ శేఖర్ రెడ్డిని పరామర్శించిన పల్లా వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ఇటీవల లింగంవారి గూడెం గ్రామంలో పల్లె సరళ నాన్న, శేఖర్ రెడ్డి మామ గత నెల రోజుల క్రితం హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రికి చికిత్స కోసం వెళ్లి చిట్యాల సత్తిరెడ్డి గుండెపోటుతో మృతి చెందాడు. గత రెండు నెలలుగా అమెరికా పర్యటనలో ఉన్న సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి, పల్లె సరళ శేఖర్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, సత్తిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకుని పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని ధైర్యం గా ఉండాలని సూచించారు.

# ఎఫ్ఆర్ఎస్ ఎన్‌రోల్‌మెంట్ 13 వేలకు పెంచాలి

### కలెక్టర్ ఆదేశం

### సిలిండర్లు,కిచెన్ గార్డెన్లు, ఫుడ్ సేఫ్టీపై సమీక్ష



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :**జిల్లాలోని పాఠశాలల్లో ఎఫ్ఆర్ఎస్ ఎన్‌రోల్‌మెంట్‌ను 13 వేల వరకు పెంచాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదేశించారు.200 మంది విద్యార్థులు ఉన్న జెడ్‌పిఎస్,ఎంపీపీ పాఠశాలలకు రెండు ఎల్‌పిజీ గ్యాస్ సిలిండర్లు మంజూరు చేస్తామని తెలిపారు.గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో ఎంఈఓలతో పీఎం పోషణ్ పథకం,మధ్యాహ్న భోజనం,కిచెన్ గార్డెన్లు, ఎల్‌పిజీ కనెక్షన్లు, ఫుడ్ సేఫ్టీ,తిథి భోజనం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.పాఠశాలకు సిలిండర్లు అందించిన తర్వాత వాటిని వినియోగించకుండా నిర్లక్ష్యం చేస్తే సంబంధిత ప్రధానోపాధ్యాయుల నుంచి ఖర్చును రికవరీ చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు.ఎఫ్ఆర్ఎస్ ఎన్రోల్మెంట్ పెంచిన పాఠశాలలకు సిలిండర్ల మంజూరులో ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.పెండింగ్‌లో ఉన్నఆధార్ ఎన్రోల్మెంట్‌ను ప్రతి పాఠశాలలో పూర్తి చేయాలని ఆదేశించారు.14 మండలాల్లో మీసేవ కేంద్రాల ద్వారా ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.హాస్టల్ విద్యార్థులకు కూడా ఆధార్ కార్డులు,జన ధ్రువపత్రాలు జూలై నెలలో అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి టమాటా,దొండకాయ, కొత్తిమీర,మునగాకు,కరివేపాకు వంటి కూరగాయలు పెంచాలని తెలిపారు.బియ్యంలో నాణ్యత లోపాలు కనిపిస్తే వెంటనే మార్చాలని,నాసిరకం బియ్యాన్ని వినియోగించరాదని స్పష్టం చేశారు.విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని,ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు,జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు,డీఎం రాంపంతి నాయక్,అడిషనల్ డీఆర్డీవో శ్రవణ్ కుమార్,జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## 10న విద్యా సంస్థల బంద్

**ప్రజాపక్షం/దేవరకొండ;** వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జులై 10న నిర్వహించనున్న రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు బుడిగ వెంకటేష్, వట్టేపు శివ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం దేవరకొండ పట్టణంలో నిర్వహించిన విలేకరులు సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం కాలేజీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వేలాది మంది విద్యార్థులు చదువును కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రణయ్, కార్తీక్, శివ, సతీష్, శివ, చైతన్య, సతీష్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమాల యోధుడికి ఘన స్వాగతం

### పల్లా వెంకట్ రెడ్డి రాకతో సిపిఐ శ్రేణుల్లో ఉత్సాహం..

**ప్రజాపక్షం/భువనగిరి :** సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ శాసనసభ్యులు కామ్రేడ్ పల్లా వెంకట్ రెడ్డి అమెరికా పర్యటనను విజయవంతంగా ముగించుకుని గురువారం భువనగిరిలోని సిపిఐ జిల్లా కార్యాలయంకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసివచ్చిన సందర్భంగా సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పార్టీ నాయకులు పల్లా వెంకట్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి తమ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ పల్లా వెంకట్ రెడ్డి అనుభవం, పార్టీ పట్ల అంకితభావం, ప్రజా సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషి పార్టీ శ్రేణులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతం, ప్రజా ఉద్యమాల నిర్మాణంలో ఆయన నాయకత్వంలో మరింత ఉత్సాహంతో పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చెడే చంద్రయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, ఎండి ఇమ్రాన్, కొల్లూరి రాజయ్య, బండి జంగమ్మ, చెక్క వెంకటేష్, ఉప్పల ముత్యాలు, చిగుర్ల లింగం, పేరబోయిన మహేందర్, యేశాల అశోక్, జిల్లా సమితి సభ్యులు కల్లేపల్లి మహేందర్, గాదెగాని మాణిక్యం, బబ్బూరి శ్రీధర్, పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, నాయకులు, నమిలే సంజీవ, పార్టీ కార్యకర్తలు పాల్గొని పల్లా వెంకట్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.



## ఎన్నో ఏళ్ల నిరీక్షణకు తెర..

### ప్రజా ప్రభుత్వంలో చిట్యాల భువనగిరి రోడ్డు విస్తరణకు గ్రీన్ సిగ్నల్



**ప్రజాపక్షం/రామన్నపేట :** ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు ఎదురు చూస్తున్న చిట్యాల భువనగిరి రహదారి విస్తరణ పనులకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. చిట్యాల నుంచి భువనగిరి వరకు నిత్యం భారీగా వాహనాల రాకపోకలు సాగుతున్నప్పటికీ, ఇరుకైన సింగిల్ రోడ్డు కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ, తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రజల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం చొరవతో ఈ రహదారి విస్తరణకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. త్వరలో గౌరవ మంత్రివర్యుల చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో, రోడ్డు నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపన స్థలాన్ని నేడు సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. అనంతరం రామన్నపేట మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలోని టీ స్టాల్ వద్ద కాసేపు ఆగిన ప్రభుత్వ విప్ వేముల వీరేశం అక్కడ ఉన్న స్థానికులతో ఆత్మీయంగా ముచ్చటించారు. వారి సమస్యలు,కష్టసుఖాలను అడిగి తెలుసుకుంటూ, ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యేను తమ మధ్య చూసిన స్థానికులు ఆనందం వ్యక్తం చేసి, పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# 13, 14, 15 తేదీలలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలి

### తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ



వివరాలు మెయిన్‌లో



## చట్టం ముందు సమాన గౌరవం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చే ప్రతి బాధిత ఫిర్యాదుదారుడికి చట్టం ముందు సమాన గౌరవం, మర్యాద దక్కుతుందని జిల్లా ఎస్‌పి కె. నరసింహ అన్నారు. జిల్లా ఎస్‌పి కార్యాలయంలో తాత్కాలిక ప్రాతిపదికన రోజువారీ కూలీలుగా పనిచేస్తున్న స్వీపర్, స్కావెంజర్ దంపతులు గురువారం బాధితులుగా ప్రజావాణికి రాగా వారికి సగటు ఫిర్యాదుదారులకు ఇచ్చేంత గౌరవం ఇచ్చి సమస్యను అడిగి తెలుసుకున్నారు. సూర్యాపేట పట్టణంలో ఒక ప్లాట్ కొనుగోలు విషయంలో తీవ్రంగా మోసపోయామని, లేని ప్లాట్‌ను ఉన్నట్లు చూపించి డబ్బులు తీసుకున్నారని మేము మోసపోయాము న్యాయం చేయాలంటూ కోరారు. ఈ మోసంపై తక్షణమే విచారణ జరిపి బాధితులకు భరోసా కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## మోతె ఎస్‌ఐగా లచ్చిరెడ్డి

**ప్రజాపక్షం/మోతె :** మండల ఎస్‌ఐగా బి. లచ్చిరెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ లచ్చిరెడ్డి మాట్లాడుతూ మండలంలో రాజకీయ నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు శాంతి భద్రతలను కాపాడాలన్నారు. ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరు శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీస్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

## ఓట్ల నమోదు ప్రక్రియ బాధ్యత బిఎల్‌ఒలే చేపట్టాలి

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణంతో పాటు నియోజకవర్గంలో నిరక్షరాస్యులు సాంకేతిక అవగాహన లేని ఉన్న వారే ఎక్కువగా ఉన్నందున ఓట్ల నమోదు ప్రక్రీయ బాధ్యత బిఎల్‌వోలే చేపట్టినందుకు చర్యలు తీసుకోవాలని బిఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు ఎస్‌కె నయీం ఆర్డీవోను కోరారు. గురువారం ఈ మేరకు ఆ పార్టీ నాయకులతో కలిసి ఆర్వీడో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎల్‌వోలు సర్ ఫారాలను పంపిణీ చేయడం వల్ల ప్రయోజనం లేదని, వారే ఇంటింటికి తిరిగి ఓట్లు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కరీముల్లాబాబా, ఉపేందర్‌గౌడ్, నాగుల్ మీరా, చలిగంటి వెంకట్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన పిఎసిఎస్ పాలకవర్గ సభ్యులు

**ప్రజాపక్షం/బీబీనగర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పిఎసిఎస్‌లకు చైర్మన్‌లను నియమించిన విషయం విధితమే బీబీనగర్ మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పొట్టొల్ల శ్యామ్ గౌడ్ గురువారం ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ సభ్యులతో కలిసి ఎమ్మెల్యేను శాలువా పూలమాలతో సన్మానించి స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగళి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు సురకంటి సత్తిరెడ్డి, వైస్ చైర్మన్ వాకిటి చంద్రశేఖర్ రెడ్డి, డైరెక్టర్లు బాలరాజు ఉప్పలంచి శ్రీకాంత్, గండు బసవయ్య యాదవ్ పాల్గొన్నారు.



## నాణ్యతతో త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** నల్ల చెరువు కట్ట అభివృద్ధి పనులను ప్రజలకు ఇబ్బంది కలగకుండా నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా రూ.3.14 కోట్లతో 8, 9 వార్డుల్లో చేపట్టిన నల్లచెరువు కట్ట అభివృద్ధి పనులను ఆమె గురువారం ప్రారంభించి మాట్లాడారు. నల్లచెరువు కట్ట అభివృద్ధిలో భాగంగా గ్రీనరీ, రేలింగ్ ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. పట్టణ ప్రజల సమస్యలు పరిష్కరించడంతోపాటు వారికి ఆహ్లాదాన్ని అందించేందుకు మున్సిపల్ పాలకవర్గం విశేష కృషి చేస్తుందన్నారు. కాంట్రాక్టర్లు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అనుకున్న సమయానికి



పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు పోతు రాజు ఇందుశ్రీ అనిల్, బండారు మంగమ్మ వెంకన్న, గంగ లింగారెడ్డి, సత్తిరెడ్డి, నాగేంద్రబాబు, కాంట్రాక్టర్లు సుజన్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## విధుల్లో చేరిన అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్



**ప్రజాపక్షం/కోదాడ:** అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్స్‌పెక్టర్ (ఎవిఎంవిఐ) గా పి.స్రవంతి గురువారం విధుల్లో చేరారు. పోలీస్ అకాడమిలో శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న అనంతరం ఆమె మోటార్ వెహికల్స్ ఇన్స్‌పెక్టర్‌గా షేక్ జిలానీకి రిపోర్టు చేశారు. పోలీస అకాడమిలో నిర్వహించిన శిక్షణలో స్రవంతి మోటార్ వాహన చట్టాల అమలు, రహదారి భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు ప్రమాదాల దర్యప్తు ప్రజాసేవ తదితర అంశాల్ల సమగ్ర శిక్షణ పొందారు. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా ఆమె మోటార్ వాహన శాఖలో తన సేవా ప్రస్థానాన్ని ప్రారంభించారు. విధుల్లో చేరినసందర్భంగా మోటార్ వెహికల్స్ షేక్ జిలానీ, కోదాడ యూనిట్ కార్యాలయ సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. కోదాడ పరిధిలో మోటార్ వాహన చట్టాల సమర్థవంతమైన అమలు, రహదారి భద్రతపై అవగాహన పెంపు, ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన సేవల అందింపులో మరింత బలోపేతం కలుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## స్ఫూర్తి యాత్రను నిర్వహించడం అభినందనీయం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** 30 ఏళ్ల గొర్రెల మేకల పెంపకం దారుల ఉద్యమ ప్రస్థానం సందర్భంగా అమరవీరులు చేసిన అసమాన త్యాగాలు గుర్తు చేసుకుంటూ స్ఫూర్తి యాత్రను నిర్వహించడం అభినందనీయమని ప్రముఖ వైద్యులు, మున్సిపల్ కౌన్సిలర్ రామ్మూర్తి యాదవ్ అన్నారు. గురువారం జనగామ జిల్లా కడివెండి గ్రామంలోని తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య స్మారక స్థూపం నుండి ప్రారంభమైన స్ఫూర్తియాత్ర జిల్లా కేంద్రానికి చేరుకున్న సందర్భంగా పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం ఏర్పడి 30 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా నాటి నుంచి నేటి వరకు



ఉద్యమంలో పనిచేస్తూ అమరులైన కుటుంబాలను కలిసి ఆ పోరాట యోధులు చేసిన అసమాన త్యాగాలను గుర్తు చేసుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా 40 కుటుంబాలను కలుసుకోవడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొల్లం అశోక్, చల్ల మల్లయ్య, జిల్లెల్ల పెంటయ్య, కడెం లింగయ్య, ఉప్పుల రమేష్, మట్టిపెల్లి సైదులు, వజ్జా వినయ్ యాదవ్, కంచుగట్ల శ్రీనివాస్, కంబాలపల్లి శ్రీనివాస్, రాజుల నాగరాజు, బయ్యా మల్లికార్జున్ యాదవ్ పాల్గొన్నారు.

## 15న నిరుద్యోగ సమస్యపై సిపిఐ(ఎం) మహాధర్నా

**ప్రజాపక్షం/నకిరేకల్ :** రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారం,ఎన్నికల హామీల అమలు కోసం ఈనెల 15న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నకిరేకల్‌లోని ఎన్ఆర్ భవన్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా యాప్ రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని,వెంటనే దానిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు కల్తీ లేని, నాణ్యమైన విత్తనాలను సకాలంలో అందుబాటులో ఉంచాలని కోరారు. మూసీ ప్రాజెక్టు డ్యాంకు తూతూమంత్రంగా మరమ్మతులు చేపడుతున్నారని, దీంతో ప్రతి ఏడాది భారీగా నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.విద్య,వైద్య రంగాల పరిస్థితిపై సీపీఎం బృందాలు రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నాయని, ఆ పర్యటనల్లో అనేక సమస్యలు వెలుగుచూస్తున్నాయని




చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 27 వేల పాఠశాలలను కుదించి సుమారు నాలుగు వేల ఇంటిగ్రేటెడ్ పాఠశాలలుగా మార్చాలని భావిస్తోందని,కానీ సాధారణ పాఠశాల విద్య బలోపేతంపై శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. ఈకార్యక్రమంలో ఆపార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల,మండల కార్యదర్శిలు రాచకొండ వెంకట్‌గౌడ్,అవిశెట్టి శంకరయ్య,చింతపల్లి బయన్న,పెంజర్ల సైదులు,చింతపల్లి లూర్దుమారయ్య,చలకాని మల్లయ్య,వంటెపాక వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌సి స్టడీ సర్కిల్ ఉచిత శిక్షణ

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** తెలంగాణ రాష్ట్ర ఎస్‌సి స్టడి సర్కిల్ హైదరాబాద్‌లో యూపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ 10 నెలల ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్‌కు జిల్లాకు చెందిన నిరుద్యోగులైన, అర్హులైన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టి వర్గాల వారు ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి డిగ్రీ ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి కె. దయానంద రాణి, తెలంగాణ ఎస్‌సి స్టడి సర్కిల్ హనరరీ డైరెక్టర్ టియ నాగయ్యలు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించకుండా ఉన్నటువంటి వారు 9 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జూలై 26న ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రవేశ పరీక్షలో పొందిన మెరిట్ ఆధారంగా అర్హులైన అభ్యర్థులకు ప్రవేశం కల్పించి ఎస్‌సి స్టడీ సర్కిల్, బంజార హిల్స్, హైదరాబాద్‌లో సివిల్ సర్వీస్ ఎక్జామినేషన్ (ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) పరీక్షకు 10 మాసాల పాటు ఉచిత వసతి, భోజనంతో కూడిన శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

## 12న 6వ తరగతి ప్రవేశ పరీక్ష

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** 2026/27 విద్యా సంవత్సరానికి యంగ్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్ (వైఐఐఓఇకెజిబివిస్)లో 6వ తరగతి ప్రవేశాల కోసం ఈనెల 12న ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి, ఎక్స్‌అఫిషియో జిల్లా ప్రాజెక్టు అధికారి అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి ప్రవేశ పరీక్షను ఆదివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు సూర్యాపేట జిల్లాలోని 3 సంబంధిత యంగ్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్‌లైన కెజిబివి చింతలపాలెం, కెజిబివి గరిడేపల్లి, కెజిబివి పెన్‌పహాడ్ కేంద్రాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందన్నారు. ప్రవేశ పరీక్ష కొరకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ప్రత్యేకాధికారిణిలు అందరూ దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులను పరీక్షకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు సంబంధిత కెజిబివి ప్రత్యేక అధికారులను సంప్రదించాలని కోరారు.

## నవోదయలో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ పరిధిలోని ప్రతిష్టాత్మక జవహర్ నవోదయ విద్యాలయం (సూర్యాపేట) 2027/28 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైనట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ బి. ఆదినారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రతిభావంతులైన గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జూలై 31 ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదిని తెలిపారు. ప్రవేశ పరీక్ష 2026 నవంబర్ 28న నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్చి/ఏప్రిల్ 2027న ఫలితాలు విడుదల అవుతాయన్నారు. అభ్యర్థి తప్పనిసరిగా సూర్యాపేట జిల్లాకు చెందిన వారై ఉండాలని, ప్రస్తుతం 202627 విద్యాసంవత్సరంలో జిల్లాలో ఏదైనా ప్రభుత్వ లేదా ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువుతు ఉండాలని, విద్యార్థుల వయో పరిమితి 01.05.2015 నుంచి 31.07.2017 మధ్య జన్మించి ఉండాలని వివరించారు. https://cbseitms.rcil.gov.in/nvs/ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర సమాచారం కోసం నవోదయ విద్యాలయ, సూర్యాపేట సెల్ 6300624049ను సంప్రదించాలని కోరారు.

## విశ్రాంత ఉద్యోగుల సంఘానికి చేయూతనిద్దాం



**ప్రజాపక్షం/నడిగూడెం:** ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ జూనియర్ అసిస్టెంట్ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల శాఖ జాయింట్ సెక్రటరీ ఏపూరి రాములు జన్మదినం సందర్భంగా వారి గృహాన్ని సందర్శించి శాలువాతో సన్మానించి, కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ ఏపూరి తిరుపతమ్మ సుధీర్ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సంఘం చేపట్టే కార్యక్రమాలను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో గుండు అనంతరాములు, ఎండి ఖలీల్ అహ్మద్, ఎల్.బాలాజీనాయక్, ఎండి ఇబ్రహీం, విజయమ్మ, వీరయ్య, సైదమ్మ పాల్గొన్నారు.

# సర్ కార్యక్రమం తనిఖీ

**ప్రజాపక్షం/అనంతగిరి:** మండల పరిధిలోని వాయిల సింగారంలో ప్రభుత్వం చేపట్టిన సర్ కార్యక్రమంలో బాగంగా అనంతగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు శ్రీనివాసరెడ్డి గ్రామ పంచాయతీ వద్ద నిర్వహిస్తున్న ఎన్యూమరేషన్ ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఎన్యుమరేషన్ ఫారాలను పూరించే విధానం, సంబంధిత బిఎల్‌వోలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. దేశ వ్యాప్తంగా ఇప్పటి వరకు 13సార్లు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ప్రస్తుతం 14వ సారి చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బాబు నాయక్, కొండపల్లి వాసు, మత్స్యకారుల సంఘం అధ్యక్షులు గుండ్లపల్లి వెంకన్న, యూత్ అధ్యక్షులు దాములూరి మురళి పాల్గొన్నారు.

# జాతీయ విద్యార్థి దినోత్సవం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మిర్యాలగూడ నగర శాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యార్థి దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా పట్టణంలోని ఆరోరా, సినాప్సు జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నరేష్ తేజ మాట్లాడుతూ కేవలం ఐదుగురు విద్యార్థులతో ప్రారంభమైన విద్యార్థి పరిషత్, నేడు కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు 78 లక్షల సభ్యత్వంతో ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా అవతరించిందని పేర్కొన్నారు. ఈ సదస్సులో ఏబీవీపీ బాధ్యులు వంశీ, సాయి, వరుణ్, ధనుష్, నాగరాజు, అజయ్, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# తాజ్పూర్ సందర్శన

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్:** భువనగిరి ఎంపీడీఓగా ఇటీవల పదవీ బాధ్యత లు చేపట్టిన ఎంపీడీఓ విజయలక్ష్మి తాజ్ పూర్ గ్రామాన్ని సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష్ శ్రీనివాస్ ఘన స్వాగతం పలికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గ్రామపంచాయతీ తీర్మానాలు, సిబ్బంది కి సంబంధించిన వివరాలు, గ్రామంలోని అభివృద్ధి కార్యక్రమాలు అడిగి తెలుసుకోవడం జరిగింది. ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి పాఠశాలలో ఇటీవల చేసిన పునరుద్ధరణ పనులు, మధ్యాహ్న భోజన రుచి, సుచి పరిశీలించారు. తదుపరి పల్లెప్రకృతి వనం నర్సరీ ని సందర్శించి పలు సూచనల, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సామాజిక వేత్త డా, ర్యాకల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి నర్సింగ్ రావు, ఉప సర్పంచ్ వరిగంటి కృష్ణ పాల్గొన్నారు.

# సర్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు

**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** మండల కేంద్రంలో ప్రజలకు ఎన్నికల ఎన్యూమరేషన్ (సర్) ఫారంలు నింపడంలో సహాయం అందించేందుకు మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ సూచనల మేరకు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక సర్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఈ హెల్ప్ డెస్క్ ద్వారా ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను ఉచితంగా నింపించడం, అవసరమైన వివరాలను నమోదు చేయించడం, సందేహాలకు సమాధానాలు ఇవ్వడం వంటి సేవలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, మాజీ ఎంపిటీసీ పూలపల్లి జనార్ధన్, టౌన్ అధ్యక్షుడు నాగులపెల్లి దేవగిరి, సర్పంచ్ పూజారి వనజ సైదులు పాల్గొన్నారు.



# రోడ్డు పనులు వెంటనే పూర్తికి జెఏసి నిరాహార దీక్ష

**నార్కట్‌పల్లి రోడ్ల దుస్థితిపై నేడు బంద్‌కు పిలుపు**



ప్రజాపక్షం/నార్కట్‌పల్లి : పట్టణంలో రోడ్డు విస్తరణ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ జాయింట్ యాక్షన్ కమిటీ (జెఏసి) ఆధ్వర్యంలో గురువారం పోలీస్ కాంప్లెక్స్ వద్ద ఒక రోజు నిరాహార దీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జెఏసి నాయకుడు చిరుమర్తి యాదయ్య మాట్లాడుతూ గత వారం రోజులుగా రోడ్డు సమస్య పరిష్కారం కోసం వివిధ రూపాల్లో ఆందోళనలు చేపడుతున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. రోడ్లుభవనాల శాఖ మంత్రి సొంత మండలంలోనే రోడ్ల సమస్యపై స్పందించకపోవడం బాధాకరమని అన్నారు.రోడ్ల దుస్థితి కారణంగా ఇప్పటికే నలుగురు ప్రాణాలు కోల్పోయారని,పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై తీవ్ర గాయాలపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రోడ్డు పనులను తక్షణమే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, శుక్రవారం నిర్వహించనున్న బంద్‌లో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ నిరాహార దీక్షలో జెఏసి నాయకులు దోసపాటి విష్ణు,బోయపల్లి శీను,మేడబోయిన శ్రీనివాస్,డాక్టర్ భాస్కరరావు,కొప్పు శ్రావణ్,ఎండి నజీర్,లింగాల యాదయ్య,వడ్డేపల్లి నాగరాజు,మారీదు శివ కృష్ణ,పుల్లెంల మహేష్,పుల్లెంల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మందుల సామేలుకు శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల సంక్షేమ కమిటీ సభ్యులుగా నియమితులైన తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలుకి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి అధ్యక్షతన పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంగతుర్తి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ ఫలాలు ప్రతి పేదింటికి అందే విధంగా శాసనసభ్యులు కృషి చేస్తున్నారని, రాష్ట్రవ్యాప్తంగా రైతులందరికీ ఏకకాలంలో రైతు భరోసా నిధులు విడుదల చేయడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మనగోటి జోజి, సీనియర్ నాయకులు పూలపెల్లి సోమిరెడ్డి, పాశం సత్యనారాయణ, బొమ్మగాని ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక వాతావరణంతోనే సనాతన ధర్మ పరిరక్షణ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గ్రామీణ ప్రాంతాలలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించడం ద్వారానే సనాతన ధర్మ పరిరక్షణ సాధ్యమవుతుందని మిర్యాలగూడ మాజీ శాసనసభ్యుడు నల్లమోతు భాస్కర్ రావు అన్నారు. మిర్యాలగూడ మండల పరిధిలోని యాద్గార్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో కొలువై ఉన్న శ్రీ భూదేవి చెన్నకేశ్వర స్వామి దేవాలయ నవమ వార్షికోత్సవ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. జిల్లా రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ఆయనకు అర్చకులు, గ్రామ పెద్దలు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి మూలవిరాట్టును దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనను శాలువాతో సత్కరించి భగవంతుని జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో మట్టపల్లి సైదయ్య యాదవ్, జొన్నలగడ్డ రంగారెడ్డి, పాదూరి సంజీవరెడ్డి, కొనకంచి శేఖర్‌రావు, పిసికె.ప్రసాద్, తుమ్మల ఫణికుమార్, పులి జగదీష్, నాగేందర్, రవీందర్, పోలు నాగార్జున, దయాకర్‌రెడ్డి, నాగయ్య, మాతంగి రవి, చిరుమామిళ్ళ వేణుగోపాల్ రావు, రంగా శ్రీధర్, సైదానాయక్, షైక్ ఫయాజ్, శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# సిల్క్ సహకార సంఘం అధ్యక్షురాలిగా గోలి పద్మ

**ప్రజాపక్షం/నకిరేకల్:** నకిరేకల్ పట్టణానికి చెందిన గోలి పద్మ సిల్క్ సహకార సంఘం అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు.ఈసందర్భంగా గురువారంప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తూ సభ్యుల సంక్షేమం కోసం సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించి సంఘానికి మరింత మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో యం కృష్ణమూర్తి, ప్రసాద్ నరసింహ,లక్ష్మమ్మ శశికళ తదితరులు పాల్గొన్నారు.నకిరేకల్ మండలం చందంపల్లి గ్రామ సమీపంలో నేషనల్ హైవే వెంట నూతనంగా ఏర్పాటు చేసిన ఈవీ (ఎలక్ట్రిక్ వెహికల్) ఛార్జింగ్ స్టేషన్‌ను గురువారం ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాదగోని కొండయ్య,సీనియర్ నాయకులు పన్నాల రాఘవరెడ్డి,గుత్తా మాధవ రెడ్డి నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



# యాదగిరిగుట్ట ధర్మకర్తల నియామకంపై భక్తుల అసంతృప్తి

**పునఃపరిశీలించాలని కోమటిరెడ్డి మోహన్ రెడ్డి డిమాండ్**

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద పుణ్యక్షేత్రమైన శ్రీ యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి ధర్మకర్తల మండలి నియామకంలో ఉమ్మడి జిల్లా భక్తులకు ప్రాధాన్యత ఇవ్వకుండా స్థానికేతరులకు అవకాశం కల్పించడాన్ని శ్రీ వారిజాల వేణుగోపాల స్వామి దేవస్థానం,గోపలాయపల్లి ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ కోమటిరెడ్డి మోహన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.దేవాలయానికి నియమించిన ధర్మకర్తల మండలి ఏర్పాటు విషయంలో మరోకసారి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ఉమ్మడి నల్గొండ జిల్లా భక్తుల తరపున విజ్ఞప్తి చేస్తున్నానని ఆయన అన్నారు.ఇది జిల్లా భక్తుల మనోభావాలను కించపరిచే చర్యగా భావిస్తున్నామని తెలిపారు.జిల్లాలో ఇద్దరు మంత్రులు,ఎంపీలు,ఎమ్మెల్యేలు ఉండి కూడా ఈ విషయంపై స్పందించకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నామని,ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం కాకముందే ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించి తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఈనెల 10న (నేడు) వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ధనియాకుల శ్రీకాంత్ వర్మ, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు పుల్లూరి సింహాద్రి కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని 60 అడుగుల రోడ్డులో విద్యారంగ సమస్యలను పరిష్కారం చేయాలని నిరసన వ్యక్తం చేసిన అనంతరం వారు మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యావ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన సమయంలో విద్యారంగాన్ని బలహీనపరిచే విధానాలు అమలు అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిడమర్తి భరత్, ఆకారపు సాయి వెంకట్, మణి, సురేష్, గోపి, శ్రవణ్, సాగర్, అరుణ్, జానీ పాల్గొన్నారు.

## 10న విద్యా సంస్థల బంద్ జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/గుండాల;** ప్రభుత్వం కాలేజీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జులై 10వ తేదిన ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వేముల నాగరాజు గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పిలుపునిచ్చారు. అనంతరం గుండాల మండల ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన మండల కమిటీ అధ్యక్షులుగా దార సతీష్, మండల కార్యదర్శిగా ఎండి. ఇర్ఫాన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రేమ్‌కుమార్, శ్రీకాంత్, అఖిల్, యాకస్వామి, నరేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హుజూర్‌నగర్ ఎస్ఐ చలికంటి నరేష్ హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఏర్పాటు చేసి మాట్లాడారు. పట్టణ కేంద్రంలో గత సోమవారం ఇరువర్గాల యువకుల మధ్య జరిగిన ఘర్షణపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఘర్షణకు దిగిన ఏడుగురు యువకులకు పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించామని, వారిలో మార్పు కోసం కౌన్సిలింగ్ చేశామని తెలిపారు. అనంతరం సత్ప్రవర్తన కలిగి ఉంటామనే నిబంధనలపై మండల తహసిల్దార్ ఎదుట ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయల చొప్పున సంవత్సర కాలానికి బైండోవర్ చేసినట్లు తెలిపారు.





## ప్లేట్లు బహుకరణ

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మసాన్‌పల్లి గ్రామం లోని ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఎస్ఎంసి మాజీ చైర్మన్ పాలడుగు సోమనర్సయ్య జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు పాలడుగు శ్రీహర్ష ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్లేట్లు అందజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్పతి, కొండయ్య, రమేష్, ఎల్లేష్, మహేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం అభినందనీయం



**ప్రజాపక్షం/నడిగూడెం:** మండల కేంద్రంలో ఉన్న శ్రీసాయిబాబా మందిరంలో ప్రతి గురువారం దాతల సహకారంతో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని నూతన తహసిల్దార్ ఎల్.మంగా అన్నారు. గురువారం సాయిబాబా మందిరంలో ప్రత్యేకపూజ కార్యక్రమంలో పాల్గొని అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టి తొలిసారి మందిరానికి విచ్చేసిన తహసిల్దార్ ఎల్. మంగకు సాయిసేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాయిసేవా సమితి ప్రధాన కార్యదర్శి ఎంవి రమణరావు, మహేష్, ఉషారాణి, సునీల, దేవాలయ పూజారి రాజశేఖర్ శర్మ, ఆర్ఐ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

## ఎబివిపి ర్యాలీ

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 78వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హుజూర్‌నగర్‌లో గురువారం బారీ ర్యాలీ నిర్వహించారు. దేశభక్తి, విద్యార్థి హక్కులు, జాతీయ చైతన్యం, సమాజ సేవ అనే సందేశాలతో ర్యాలీ ఉత్సహ భరీతంగా సాగింది. ఎబివిపి 1949 జూలై 9న స్థాపించబడిందని దేశ వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని నవీన్‌కుమార్‌గౌడ్ తెలిపారు. విద్యార్థి శక్తి దేశ శక్తి అనే భావనతో ప్రతి విద్యార్థి సమాజ సేవలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎబివిపి నాయకులు, కార్యకర్తలు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## నాగరాజు మృతి కాంగ్రెస్‌కు తీరనిలోటు

**ప్రజాపక్షం/అనంతగిరి:** నాగరాజు మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం వాయిలసింగారం గ్రామానికి చెందిన కలకొండ సతీష్ తమ్ముడు నాగరాజు గత పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన దశ దినకర్మలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరమార్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాబునాయక్, చుండూరు వెంకటేశ్వరరావు, కొండపల్లి వాసు, దాములూరి మురళి, నరేందర్, వీరబోయిన నాగరాజు, బిక్షం, ముత్తయ్య, సతీష్ పాల్గొన్నారు.

# కోదాడలో భూకబ్జాలు, మట్టి మాఫియాపై మాజీ ఎమ్మెల్యే బొల్లం ఆరోపణలు

**ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు):** కోదాడ నియోజకవర్గంలో చెరువులు, ప్రభుత్వ భూములు, కొండలు, కాలువలు అక్రమ ఆక్రమణలకు గురవుతున్నాయని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఆరోపించారు. గురువారం చిలుకూరు మండలంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో భూకబ్జాలు, మట్టి మాఫియా కార్యకలాపాలు పెరిగాయని విమర్శించారు. గణపవరం గ్రామ చెరువులో సుమారు 20 ఎకరాల భూమి అక్రమణకు గురై రియల్ ఎస్టేట్ ప్లాట్లుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, కోదాడ పట్టణంలోని ఎర్రకుంట కాలువ వద్ద కూడా కాలువ భూములను అక్రమించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మోతె మండలం ఉర్లుగొండ గ్రామంలోని రాయికుంట చెరువులో అనుమతులు లేకుండా భారీ ఎత్తున మ ట్టి తవ్వకాలు జరుగున్నాయని, రాత్రి వేళలో జెసిబిలు, ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారని ఆరోపించారు. కోదాడ సూర్యాపేట ప్రధాన రహదారిపై సుమారు 20 కోట్ల విలువైన చెరువు భూమి అక్రమణకు గురవుతుందని, యాదవ్ నగర్‌లో మున్సిపల్ స్థలంలో అక్రమ నిర్మాణాలు జరిగాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బట్టు శివాజీ నాయక్, తాళ్లూరి శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సర్ ఫారం బాధ్యతగా నింపి అధికారులకు ఇవ్వాలి



**ప్రజాపక్షం/ హాలియా:** సర్ ఫారములను బాధ్యతగా నింపి సంబంధిత అధికారులకు అందించాలని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. గురువారం మాజీ ఎమ్మెల్యే భగత్ నివాసంలో బిఎల్వోలు సర్ ఫారములను ఆయనకు అందజేశారు.దానిని తీసుకున్న ఆయన ఆ సర్ ఫారం లను పూర్తిగా నింపి అధికారులకు కావలసిన సమాచారాన్ని అందులో పొందుపరిచే వారికి అందజేశారు.ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే భగత్ మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ లోపు ఈ సర్ ఫారం లను నింపి అధికారులకు అందజేయాలని చెప్పారు. ఈఫారం ను గడువులోగా అందించనటస్తీతే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఏదైనా కారణం చేత బిఎల్వోలు అందుబాటులో లేకపోతే భయపడాల్సిన అవసరం లేదని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా టిఆర్ఎస్ పార్టీ తరఫున బూతు లెవెల్ ఏజెంట్లను నియమించినట్లు చెప్పారు.పార్టీ ఏర్పాటు చేసిన ఈ ఏజెంట్లు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పార్టీ శ్రేణులు ఒక్కరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు.

## నేర్చుకున్న అంశాలను తరగతిలో అమలు చేయాలి

### ఆంగ్ల ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల నందు నిర్వహిస్తున్న మూడు రోజుల సమగ్ర వృత్యంతర ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు ఆంగ్లభాష ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ప్రేమ్ కరణ్ రెడ్డి,జిల్లా విద్యాశాఖ అధికారి సుశిధర్ రావు సందర్శించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో 11 మండలాల నుండి హాజరైన ఆంగ్ల ఉపాధ్యాయులు,శిక్షణ అందిస్తున్న రిసోర్స్ పర్సన్ల తీరుతెన్నులను, ఉపాధ్యాయుల క్రియాశీలక భాగస్వామ్యాన్ని వారు స్వయంగా శిక్షణ కేందం్రలోని భాగస్వాములతో పాటు కూర్చొని పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఇక్కడ నేర్చుకున్న అంశాలను తరగతి గది బోధనాఅభ్యసన ప్రక్రియలలో ప్రభావంతంగా అమలుపరచాలని సూచించారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆంగ్లభాష పట్ల ఉన్న భయాన్ని, బిడియాన్ని తొలగించి విద్యార్థులు నిర్భయంగా,ఆత్మవిశ్వాసంతో మాట్లాడేలా తయారు చేయాలన్నారు.ఈ సందర్భంగా డీఈఓ సుశిధర్ రావు మాట్లాడుతూ ఆంగ్లంలో విద్యార్థులకు సిలబస్‌లో భాగంగా నిర్దేశించబడిన 17 భాషా నైపుణ్యాలనుపిల్లలలో అభివృద్ధి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపల్ నరసింహ,క్వాలిటీ కోఆర్డినేటర్ ఎ. శ్రీనివాస గౌడ్, సెంటర్ ఇన్చార్జ్ రఘుపాల్ రెడ్డి,రిసోర్స్ పర్సన్లు అనురాధ,విష్ణు,శ్రీనివాస్,ఉమా శంకర్,సత్యనారాయణ, శ్రీధర్,ఆంగ్ల భాష ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు వైఎఫ్ఎస్ సహకారం అభినందనీయం

**ప్రజాపక్షం/త్రిపురారం :** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూత్ ఫర్ సేవ వైఎఫ్ఎస్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయం త్రిపురారం మండల విద్యాధికారి రవి నాయక్ అన్నారు.గురువారం త్రిపురారం,పెద్ద దేవులపల్లి గ్రామాల్లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూత్ ఫర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో బ్యాగులు,నోట్ బుక్స్,జామెంట్రీ బాక్సులు,తదితర సామాగ్రి తో కూడిన కిట్లను అందచేశారు.ఈసందర్భంగా మండల విద్యాధికారి రవి నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు దాతల సహాయాన్ని సద్విని చేసుకుని చదువులో రాణించాలని ఆయన సూచించారు.ఈకార్యక్రమంలో యూత్ ఫర్ సేవ సంస్థ చాప్టర్ కోఆర్డినేటర్ దేవులపల్లి నాగేందర్,సీనియర్ వాలంటరీ సుజేంద్ర,గ్రామ యువత సింగం శీను,లోకేష్,పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మయ్య, మల్లారెడ్డి, దయాకర్,రాములు,గోవర్ధన్ రెడ్డి,రామారావు తదితరులు పాల్గొన్నారు.



## ధర్నాను విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** తెలంగాణ కల్లుగీత పనివారాల సంఘం ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలకూరి బాబు పిలుపునిచ్చారు. గురువారం హుజూర్‌నగర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో కల్లుగీత వృత్తిదారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. 51 సంవత్సరాలు నిండిన అర్హులైన కల్లుగీత పనివారాలకు పెన్షన్లు ఇవ్వాల్సి ఉండగా, రెండున్నర సంవత్సరాలు దాటిన పెన్షన్ కల్పించట్లేదని అన్నారు. గీతవృత్తి పెన్షన్ పొందుతూ మరణించిన వారి కుటుంబాలను గాలికి వదిలేశారని ఆరోపించారు.

## ఎస్ఐఆర్ పరిశీలన, నమోదు



**ప్రజాపక్షం/రామన్నపేట :** స్థానిక రామన్నపేట మేజర్ గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో పట్టణ ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక ఓటరు జాబితా (ఎస్ఐఆర్)పరిశీలన మరియు నమోదు కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభమైంది. రామన్నపేటలోని పాత బస్టాండ్ ఆవరణలో ఈ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గురువారం జరిగిన ఈ శిబిరంలో ఓటర్లు తమ వివరాలను సరిచూసుకోవడానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్థానిక బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉండి, ప్రజల నుంచి అప్లికేషన్లను స్వీకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గరిక సత్యనారాయణ,ఉప సర్పంచ్ మోటే రమేష్,వార్డు సభ్యులు, బిఎల్ఓలు,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## యూరియా పంపిణీ

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ప్రభుత్వం మార్గదర్శకాలతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సబ్సిడీపై యూరియా పంపిణీ చేస్తున్నామని గురువారం పోచంపల్లి మండల వ్యవసాయ అధికారిణి శైలజ తెలిపారు. శివారెడ్డి గూడెం గ్రామంలో యాప్ ద్వారా రైతులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని బుకింగ్స్ చేయలేక ఇబ్బందులు పడుతూ యూరియా సరిగ్గా సరఫరా చేయడం లేదని గ్రామ సర్పంచ్ అధికారితో మాట్లాడిన ఆడియో సంభాషణలపై ఆమెను వివరణ కోరగా స్పందించారు. రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని ప్రభుత్వ నిబంధనల ప్రకారం యాప్ ద్వారా నమోదు చేసుకున్న వాళ్లకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు యూరియా సరఫరా చేసే కేంద్రాలను స్టాక్‌ను పారదర్శకంగా తెలుపుతున్నట్లుగా చెప్పారు.

## బ్రెయిన్ స్ట్రోక్ తో బాధపడుతున్న మహిళ

### ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్న చిన్నారి అక్షిత



**ప్రజాపక్షం/వేములపల్లి :** ఉమ్మడి మండలం కుక్కడం గ్రామంలో ఓ మహిళ బ్రెయిన్ స్ట్రోక్ తో పోరాడుతూ ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తోంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కుక్కడం గ్రామానికి చెందిన వడ్డేపల్లి వెంకటమ్మ గత కొద్ది రోజులుగా బ్రెయిన్ స్ట్రోక్ తో మంచాన పడింది.వృద్ధురాలైన వెంకటమ్మ తల్లి మిర్యాలగూడలోని ఓప్రముఖ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తోంది.ఆమెకు ఆపరేషన్ చేయాలని డాక్టర్లు చెప్పడంతో స్తోమత లేక ఇంటి దగ్గరే ఉంచి చిన్న చిన్న సేవలు చేస్తోంది. కళ్ళముందే తన కూతురు పడే నరకవేదన చూసి కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది.బ్రెయిన్ స్ట్రోక్ తో బాధపడుతున్న వెంకటమ్మకు 10 సంవత్సరాల కూతురు అక్షిత ఉంది. తన తల్లికి వచ్చిన వ్యాధికి ఎలా చికిత్స చేయించాలో అర్థం కాక వృద్ధురాలైన వెంకటమ్మ తల్లి, ఊహ తెలియని కూతురు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.గ్రామస్తుల సహాయంతో ఇంటి దగ్గరే చికిత్స పొందుతున్న వెంకటమ్మకు ఎవరైనా పెద్దలు, మానవతావాదులు తలా ఓ చేయి వేసి చికిత్సకు సహాయం చేయాలని ఆ చిన్నారి అక్షిత ఆశగా ఎదురుచూస్తోంది.



## తుమ్మలగూడెం చేనేత సహకార సంఘం కార్యవర్గం ప్రమాణ స్వీకారం

**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండలం లోని తుమ్మలగూడెం గ్రామ చేనేత సహకార సంఘం కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో గురువారం సంఘం కార్యాలయంలో ప్రమాణస్వీకాత్సవ కార్యక్రమం నిర్వహించారు. సంఘం అధ్యక్షులు రవ్వ నరసింహ, ఉపాధ్యక్షులు సబ్బం రమేష్, కార్యదర్శి మిర్యాల నరేష్, డైరక్టర్స్ రవ్వ అశోక్ కుమార్, తౌటం పాండు, మిరియాల సత్తయ్య, సబ్బం నరేందర్,తౌటం పార్వతమ్మ, దొంత లావణ్య లు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత వృత్తిదారులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## 'సర్' ప్రక్రియ పరిశీలన



**ప్రజాపక్షం/చింతలపాలెం** : మండల కేంద్రంలో కొనసాగుతున్న సర్ ప్రక్రియను ఆర్‌డిఓ శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో సర్ ప్రక్రియ అమలు తీరును, అధికారులు నిర్వహిస్తున్న విధానాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు బుసిరెడ్డి రామకృష్ణారెడ్డి, సురేందర్ రెడ్డి, సర్పంచ్ కందుల రామకోటి రెడ్డి, మోర్తాల వెంకటరెడ్డి, బిఎల్‌ఓ జ్యోతి పాల్గొన్నారు.

## చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే శిక్ష తప్పదు:

**ప్రజాపక్షం/వేములపల్లి** : చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే శిక్ష తప్పదని ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు.బుధవారం రాత్రి మాడుగులపల్లి మండలం ఇసుకబాయి గూడెం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ మాజీ ప్రజా ప్రతినిధి నిమ్మల నవీన్ రెడ్డి తండ్రి నాగిరెడ్డి మద్యం మత్తులో పోలీస్ సిబ్బందిపై దుర్భాషలాడారు. అద్దంకినార్కెట్‌పల్లి ప్రధాన రహదారిపై కొంతమంది దుండగులతో కలిసి ట్రాఫిక్‌కు అంతరాయం కల్పించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి గురువారం కోర్టు ముందు హాజరుపరిచి,విచారణ అనంతరం జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.అధికార బలంతో గాని, మద్యం మత్తులో గాని చట్టాన్ని చేతిలోకి తీసుకున్న ప్రతి ఒక్కరూ శిక్షకు అర్హులవుతారని ఆయన స్పష్టం చేశారు.

## పాఠశాలకు ఆదర్శంగా నిలిచిన సర్పంచ్

**ప్రజాపక్షం /రామన్నపేట** : రామన్నపేట మండలం బాచుప్పల ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు ఉన్న అడ్మిషన్స్ 19 కి పెరగడంలో పాఠశాల ఉపాధ్యాయులకు సహకరించడమే కాకుండా ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న తన 2 వ తరగతి అమ్మాయిని తమ ఊరి ప్రాథమిక పాఠశాలలో చేర్పించటమే కాకుండా ఒక విద్యా వాలంటీర్ ను నియమించి ఆదర్శంగా నిలిచిన బాచుప్పల సర్పంచ్ బాచుప్పల మాధవీ భూపాల్ ను మునిపంపుల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు దొడ్డి స్వామి అభినందించి సన్మానించారు.



# ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై సైబర్ నేరాలు అరికట్టాలి




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :సైబర్ నేరాలు కొత్త రూపాలు సంతరించుకుంటున్న నేపథ్యంలో పోలీసు అధికారులు నిరంతరం సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని అడిషనల్ ఎస్‌పి రమేష్ అన్నారు. సైబర్ నేరాల దర్యాప్తులో మరింత సమర్థత కోసం దర్యాప్తు అధికారులు,సైబర్ వారియర్స్‌కు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ప్రస్తుత కాలంలో రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టడంతో పాటు,బాధితులకు వేగవంతమైన న్యాయం అందించేందుకు దర్యాప్తు అధికారుల సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఒకరోజు శిక్షణలో జిల్లా పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్ల దర్యాప్తు అధికారులు, సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సైబర్ నేరాలు రోజు రోజుకు కొత్త రూపాలు సంతరించుకుంటున్నాయని తెలిపారు.

# తెలంగాణ ఉద్యమ కారుల సంఘం తుర్కపల్లి మండల అధ్యక్షుడిగా కోట సురేష్



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కారుల సంఘం తుర్కపల్లి మండల అధ్యక్షులుగా తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన కోట సురేష్‌ను నియమించినట్లు తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కారుల సంఘం రాష్ట అధ్యక్షులు పూస శ్రీనివాస్ తెలిపారు. తుర్కపల్లి మండల మాజీ జేఏసీ చైర్మెన్ ఎరుకల వెంకటేష్ గౌడ్ అధ్యక్షతన గురువారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కోట సురేష్‌కు నియామక పత్రాన్ని అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో క్రియా శీలకంగా పాల్గొన్న ప్రతి ఉద్యమ కారునికి 250 ఇంటి స్థలంతో పాటు రూ.30 వేలు పింఛన్ సౌకర్యంతో పాటు ప్రతి ఉద్యమ కారునికి గుర్తింపు కార్డులు ఇచ్చి గౌరవించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ కారుల సంఘం జిల్లా అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, రాష్ట ప్రధాన కార్యదర్శి జంపాల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షురాలు సీస మహేశ్వరి, మండల నాయకులు బండారి శ్రీను, దేవరుప్పల మల్లేష్ పాల్గొన్నారు.

# ఇళ్ళిళ్లు తిరుగుతూ : అవగాహన కల్పిస్తూ!



**ప్రజాపక్షం/హాలియా:** ఇళ్ళిళ్లు తిరుగుతూ ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ సర్ ఫారమును ఎలా నింపాలో తెలియజేస్తూ బాధ్యత గల ఒక ప్రజా ప్రతినిధిగా తన కర్తవ్యాన్ని నెరవేరుస్తూ నలుగురికి ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాడీ కౌన్సిలర్ దేపావత్ ప్రసాద్ నాయక్. ఓటు హక్కు కోల్పోతే దానివల్ల కలిగే పరిణామాలు ఓటు హక్కు ఉండటం వలన వచ్చే ప్రయోజనాలను ఇంటింటికి తిరుగుతూ అ మూల్యమైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడమే కర్తవ్యంగా భావించి హాలియా మున్సిపాలిటీ లోనే 11వ వార్డు కౌన్సిలర్ ప్రసాద్ నాయక్ చేస్తున్న ప్రచారం పలువురికి ఆదర్శంగా నిలుస్తుంది. సమాజంలో బాధ్యత గల ఒక పౌరుడిగా మాత్రమే కాక ఒక ప్రజా ప్రతినిధిగా తన కర్తవ్యాన్ని గుర్తించి ఓటు హక్కు విలువను వివరిస్తూ ఇంటింటికి ఓటర్ స్లిప్పులు అందజేసి సర్ ఫాంను ఎలా నింపాలో చెబుతూ ప్రజలకు సర్ ఫాం పై ఉన్న అపోహలను నివృత్తి చేస్తున్నారు. స్థానిక బిఎల్‌ఓ, బి ఎల్ ఏ లకు నింపిన సర్ ఫామ్ ను అందజేయాలని తెలిపారు. అనుముల వారి గూడెం 162 బూతులో కార్యక్రమంలో భాగంగా పై విధంగా ప్రజలకు అవగాహన క ల్పించి సర్ ఫాములను నింపి ఓటర్ల చేత సంబంధిత అధికారులకు అందజేసేలా ప్రచారం నిర్వహించారు.



## ప్రజలందరూ సహకరించాలి

**ప్రజాపక్షం/దేవరకొండ;** సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు ప్రజలందరూ సహకరించాలని గురువారం పట్టణంలో ఎస్సి మోర్చా నాయకులు చిత్రం ఉదయ్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం టిటిడి కళ్యాణ మండపంలో జరిగింది. పట్టణంలోని ముత్యాలమ్మ బజార్, సంతోషిమాత కాలనీలలో ఇంటింటికి తిరిగి ఓటరు సమగ్ర సవరణ సర్వేలో పాల్గొని ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు. ఈసందర్భంగా బిజెపి ఎస్సి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకూరి నర్సింహా, ఎస్సిమోర్చా జిల్లా అధ్యక్షులు బాకీ నర్సింహాలు మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ అనే ప్రక్రియ దేశ వ్యాప్తంగా జరుగుతుందని దీని ద్వారా ఓటరు జాబితా ప్రక్షాళన జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో జానీ, ఎస్సీ మోర్చా నాయకులు సైదులు, బిక్షపతి, ఆంజనేయులు, శంకర్, వెంకన్న, ప్రేమ్ పాల్గొన్నారు.

## భువనగిరి పిఎసిఎస్ ఇన్‌చార్జిగా చైర్‌పర్సన్ కొండల్ రెడ్డి బాధ్యతలు

**ప్రజాపక్షం/భువనగిరి** : భువనగిరి పిఎసిఎస్ సంఘ చైర్ పర్సన్ ఇన్చార్జి గా ఫకీర్ కొండల్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించినారు. వారితోపాటు డైరెక్టర్లుగా గడ్డమీది స్వామి, గుగ్గులోతు నరసింహ, గుండు సత్యనారాయణ, ఉడుత ఆంజనేయులు, బబ్బూరి పోశెట్టి, ఏనుగు పద్మ, తుమ్మేటి వెంకటేష్, రాసాల శ్రీశైలం, వడిచర్ల యాదగిరి, ఎర్ర మహేష్, రాంపల్లి నరేష్, ఊదరి పాపమ్మ డైరెక్టర్లుగా యాదాద్రి భువనగిరి జిల్లా సహకార అధికారి నాగార్జున సమక్షంలో పదవి బాధ్యతలు స్వీకరించినారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి, పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ ఎల్లంల జంగయ్య, భువనగిరి సీసీ బ్యాంక్ మేనేజర్ శిరీష, కాంగ్రెస్ పార్టీ నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






## ఇంగ్లీష్ మీడియం తరగతులు ప్రారంభం

**ప్రజాపక్షం/రామన్నపేట** : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా బోగారం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం తరగతులను ప్రారంభించారు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థుల బోధన కోసం ప్రభుత్వం కేటాయించిన ఉపాధ్యాయ నియామక పత్రాన్ని, అలాగే విద్యార్థుల సౌకర్యార్థం ఆయమ్మ నియామక పత్రాన్ని గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య, మౌలిక వసతుల కల్పనకు గ్రామస్థుల సహకారంతో కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోగారం గ్రామ ఉపసర్పంచ్ బైకాని ఉమా మహేష్ యాదవ్, వార్డు మెంబర్ నేరటి మానస సురేష్ యాదవ్, పాఠశాల హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ లోగో వెబ్‌సైట్ ప్రారంభం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తెలంగాణ రాష్ట్రంలో క్రీడారంగాన్ని మరింత అభివృద్ధి చేయడం,గ్రామీణ ప్రాంతాల నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిద్దే లక్ష్యంతో ఏర్పాటు చేయబోయే యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ కి సంబంధించిన లోగో,వెబ్‌సైట్‌ను గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పిటి ఉష పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు.కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి,అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్, DYSO, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సభ్యులు,వివిధ క్రీడా సంఘాల కార్యదర్శులు, జిల్లా సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు, శారీరక విద్య ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని జిల్లా స్థాయిలో విజయవంతంగా వర్చువల్ విధానంలో నిర్వహించామని జిల్లా యువజన,క్రీడల అధికారి అక్బర్ అలీ తెలియజేశారు.

## శాబ్దుల్లాపురం చేనేత సంఘం చైర్మన్‌గా వర్కాల శ్రీనివాసులు ఏకగ్రీవం

**ప్రజాపక్షం/నల్లగొండ(కనగల్లు)** : మండలంలోని శాబ్దుల్లాపురం చేనేత పారిశ్రామిక సహకార సంఘానికి జరుగుతున్న ఎన్నికల్లో వర్కాల శ్రీనివాసులు ఏకగ్రీవంగా చైర్మన్‌గా ఎన్నికయ్యారు.ఈసందర్భంగా నల్లగొండ మున్సిపల్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి,డిప్యూటీ మేయర్ ఆశ్రఫ్ అలీ, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, అబ్బగోని రమేష్ గౌడ్, కార్పొరేటర్ అల్లి సుభాష్,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు ఆయనను ఘనంగా సన్మానించి అభినందించారు.ఏకగ్రీవంగా ఎన్నికైన చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా వస్త్ర వ్యాపార రంగంలో ఉన్న అనుభవాన్ని, చేనేత కార్మికుల సమస్యల పట్ల ఉన్న అవగాహనను,కరోనా సమయంలో చేసిన సేవా కార్యక్రమాలను పరిగణనలోకి తీసుకొని పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.చేనేత కార్మికుల భవిష్యత్తు కోసం, వారి అభివృద్ధికి,ప్రభుత్వ పథకాలు సభ్యులకు అందేలా కృషి చేస్తానని చెప్పారు. ఈ సంఘాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి తెలంగాణ రాష్ట్రంలో మోడల్ ఆదర్శ సంఘంగా గుర్తింపు తీసుకొస్తానన్నారు.

